# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-09-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల సంభవించిన వరదల కారణంగా నష్టపోయిన వారికి ఈ నెల 17వ తేదీన సాయం అందించే ప్రక్రియ ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు తెలిపారు.**

2. **భారీ వర్షాల కారణంగా తెలంగాణలో ఇప్పటివరకు అందిన అంచనాల ప్రకారం 10 వేల 320 కోట్ల రూపాయల మేర నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు.**

3. **రాష్ట్రంలో రహదారులపై ఏర్పడిన గోతులను రెండు నెలల్లో యుద్ధప్రాతిపదికన పూడ్చాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

4. **తెలంగాణలో వాణిజ్యాభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.**

5. **దేశ అధికార భాషగా కేంద్ర ప్రభుత్వం హిందీని స్వీకరించినందుకు గుర్తుగా ఈరోజు హిందీ భాషా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల సంభవించిన వరదల కారణంగా నష్టపోయిన వారికి ఈ నెల 17వ తేదీన సాయం అందించే ప్రక్రియ ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు తెలిపారు. వరద బాధితులకు పరిహారం, నష్ట గణనపై ఆయన నిన్న గుంటూరు జిల్లా వెలగపూడి సచివాలయంలో మంత్రులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరదల్లో 2 లక్షల 13 వేల 456 ఇళ్లు నీట మునిగాయని ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. ఇందులో ఇప్పటి వరకు 84 వేల 505 ఇళ్లలో నష్టం అంచనాలు పూర్తి చేశారు. వేల ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు పాడయ్యాయి. 2 లక్షల 15 వేల హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని గుర్తించారు. నష్టం లెక్కలను మరోసారి పునః పరిశీలించి.. ప్రతి బాధితుడికీ సాయం అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ వివరిస్తూ..

… వాయిస్…30 సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం ఈ నెల 18వ తేదీ ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గుంటూరు జిల్లా వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో జరగనుంది. శాఖలకు

సంబంధించిన ప్రతిపాదనలపై సాఫ్ట్ కాపీతో పాటు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను రేపటిలోగా అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు.

---------------------------

భారీ వర్షాల కారణంగా తెలంగాణలో ఇప్పటివరకు అందిన అంచనాల ప్రకారం 10 వేల 320 కోట్ల రూపాయల మేర నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. వేలాది ఇళ్లు దెబ్బతిన్నాయని, లక్షలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని.. తనతో పాటు మంత్రులు, అధికారులు అప్రమత్తంగా వ్యవహరించడంతో భారీగా ప్రాణనష్టం తగ్గిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో వరదలతో వాటిల్లిన నష్టాన్ని పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర అధికారుల బృందంతో ముఖ్యమంత్రి నిన్న సచివాలయంలో సమావేశమయ్యారు. పంట పొలాల్లో బండ రాళ్లు, కంకర, మట్టి మేటలు వేయడంతో.. రైతులు కోలుకోలేనంత నష్టపోయారని బృందానికి తెలిపారు. చాలా ప్రాంతాల్లో రహదారులు, రోడ్లు, కల్వర్టులు, చెరువులు కొట్టుకుపోవడంతో నష్టం అంచనాలను మించిపోయిందని వివరించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి షరతులు లేకుండా తెలంగాణకు తక్షణమే ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తిచేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో అమల్లోకి తీసుకురానున్న నూతన మద్యం విధానంపై ఈ నెల 18వ తేదీన జరగనున్న మంత్రివర్గ సమావేశంలో ప్రతిపాదనలు ఉంచాలని ఈ అంశంపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. మంత్రివర్గంలో నిర్ణయం తీసుకున్న వెంటనే నూతన మద్యం విధానానికి సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేయాలని నిర్ణయించింది. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎక్సైజ్ కార్యాలయంలో మంత్రులు కొల్లు రవీంద్ర, గొట్టిపాటి రవి, నాదెండ్ల మనోహర్, కొండపల్లి శ్రీనివాస్, సత్యకుమార్ యాదవ్‌తో కూడిన మంత్రివర్గ ఉపసంఘం నిన్న సమావేశమైంది. ఈ సందర్భంగా 2019 కంటే ముందు రాష్ట్రంలో అమలులో ఉన్న మద్యం విధానాన్నే తీసుకురావాలని ప్రాథమికంగా నిర్ణయించింది. ఈ నెల 17వ తేదీన మరోసారి సమావేశమై తుది నిర్ణయం తీసుకోవాలని భావిస్తోంది.

---------------------------

తెలంగాణలో వాణిజ్యాభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రాబోయే పదేళ్లలో తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ అధ్యక్షతన నిన్న ముంబయిలో జాతీయ వాణిజ్య మండలి సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో వాణిజ్య విధానాలు, వ్యాపార అభివృద్ధి, ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకునే మార్పులు తదితర అంశాలను చర్చించారు. ఈ సదస్సులో పలు రాష్ట్రాల మంత్రులు పాల్గొనగా.. తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధిగా హాజరైన శ్రీధర్‌బాబు రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలు, లక్ష్యాలను వివరించారు.

---------------------------

రాష్ట్రంలో రహదారులపై గోతులు కనిపించకూడదని, రెండు నెలల్లో యుద్ధప్రాతిపదికన గోతులు పూడ్చాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గుంతలమయమైన 7 వేల 87 కిలోమీటర్ల మేర రహదారుల మరమ్మతులకు 290 కోట్ల రూపాయలు, వరదలతో దెబ్బతిన్న 4 వేల 565 కిలోమీటర్ల రహదారులను పునరుద్ధరించేందుకు 186 కోట్ల రూపాయలను రాష్ట్ర విపత్తు నివారణ నిధి నుంచి

విడుదల చేయాలని ఆదేశించారు. రహదారులు, భవనాల శాఖపై సచివాలయంలో ఆ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. వరదలతో దెబ్బతిన్న రహదారులను డ్రోన్లతో సర్వే చేయించాలని ఆదేశించారు.

---------------------------

రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు మరో రెండు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు అందుబాటులోకి రానున్నాయి. వీటిని అహ్మదాబాద్ నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎల్లుండి వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. రెండు రైళ్లలో ఒకటి తెలంగాణలోని హైదరాబాద్ నుంచి మహారాష్ట్రలోని నాగ్‌పుర్ మధ్య.. మరొకటి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ మధ్య రాకపోకలు సాగించనున్నాయి. ఈ రైళ్లను తెలుగు ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అందించిన వినాయక నవరాత్రుల కానుకని కేంద్ర గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి నిన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

---------------------------

భారతదేశ అధికార భాషగా కేంద్ర ప్రభుత్వం హిందీని స్వీకరించినందుకు గుర్తుగా ఈ రోజు హిందీ భాషా దినోత్సవం నిర్వహిస్తున్నారు. దేవనాగరి లిపిలో ఉన్న హిందీ భాషను 1949 సెప్టెంబర్ 14వ తేదీన కేంద్ర ప్రభుత్వం అధికార భాషగా గుర్తించి, రాజ్యాంగంలో చేర్చడం వల్ల ఏటా ఈ రోజును హిందీ భాషా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా హిందీ భాష ప్రాముఖ్యాన్ని తెలియజేయడం, హిందీని అంతర్జాతీయ భాషగా ప్రదర్శించడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. 1963వ సంవత్సరంలో రూపొందించిన అధికార భాషా చట్టం ప్రకారం 1965 నుంచి హిందీ, ఆంగ్ల భాషలు అధికార భాషలుగా కొనసాగుతున్నాయి. భారత స్వాతంత్ర్య పోరాటంలో ప్రజలను ఏకతాటిపై ఉంచడంలో హిందీ భాష ఆ రోజుల్లో ఎంతగానో సహాయపడింది.

కాగా.. 'రాజ్ భాషా దివస్' సందర్భంగా ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక ముఖాముఖి కార్యక్రమం ఈరోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం మొగిలి ఘాట్‌లో నిన్న జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందగా, 33 మంది గాయపడ్డారు. తిరుమల నుంచి బెంగళూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును మొగిలి ఘాట్ వద్ద రెండు లారీలు ఢీకొనడంతో బస్సు డ్రైవర్ సహా మరో ఐదుగురు ప్రయాణికులు మరణించారు. ఈ ప్రమాదంలో ఓ లారీ డ్రైవర్ కూడా ప్రాణాలు కోల్పోయాడు. క్షతగాత్రులను వివిధ ఆసుపత్రులకు తరలించారు. జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, పోలీస్ సూపరింటెండెంట్ మణికంఠ ఘటనా స్థలంలో సహాయక చర్యలను పర్యవేక్షించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం 5 లక్షల రూపాయల నష్ట పరిహారం ప్రకటించిందని కలెక్టర్ వెల్లడించారు.

---------------------------

పోలీసుస్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో రాజీ కుదుర్చుకునేందుకు అవకాశం ఉన్నవాటిని గుర్తించి ఈ రోజు జరిగే మెగా లోక్‌అదాలత్‌లో పరిష్కారమయ్యేలా చూడాలని ఆంధ్రప్రదేశ్ పోలీస్ డైరెక్టర్ జనరల్ సీహెచ్.ద్వారకా తిరుమలరావు అధికారులను ఆదేశించారు. దేశవ్యాప్తంగా జరిగే ఈ మెగా లోక్ అదాలత్‌ను మన రాష్ట్రంలోనూ నిర్వహిస్తున్నారని, దీనిపై కక్షిదారుల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని జిల్లాల పోలీస్ సూపరింటెండెంట్లు, పోలీస్ కమిషనర్లతో నిన్న ఆయన శ్రవణ మాధ్యమం ద్వారా సమీక్ష

నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రత్యేక పురస్కారం అందజేస్తామని తెలిపారు.

---------------------------

రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమాలకు హాజరుకావాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సహా నలుగురు కేంద్ర మంత్రులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. 1948 సెప్టెంబరు 17వ తేదీన తెలంగాణలో ప్రజాస్వామ్య పాలన శకం ఆరంభమైన సందర్భాన్ని పురస్కరించుకొని ప్రజాపాలన దినోత్సవం నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి స్పష్టంచేశారు.

========================